www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 29 | డిసెంబర్ | 2024
పేజీలు 6

## ఏసిబి వలలో మండల సర్వేయర్



ప్రజాపక్షం/అశ్వారావుపేట: లంచం పుచ్చుకుంటూ మరో అధికారి అవినీతి నిరోధక శాఖాధికారులకు చిక్కాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరత్నం రూ. 50వేలు రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసిబికి పట్టుబడ్డాడు. మండల పరిధిలోని ఓ రైతు తన భూమిని సర్వే చేయాలని తనకు అనుకూలంగా సర్వే నివేదికను ఇవ్వాలని సర్వేయర్‌ను కోరడంతో ఆయన అందుకు గాను 1.60 లక్షల రూపాయలను డిమాండ్ చేశాడు. ఒప్పందం మేరకు మందలపల్లి సమీపంలోని గాంధీ నగర ఇటీక బట్టిల వద్దకు రైతు రూ. 50వేలతో అక్కడకు రాగా వాటిని తీసుకునేందుకు సర్వేయర్ వెంకటరత్నం వెళ్లడంతో అవినీతి నిరోధక శాఖ డిఎస్‌పి రమేష్ నేతృత్వంలో వలపన్ని పట్టుకున్నారు. ప్రస్తుతం సర్వేయర్ వెంకటరత్నం ఏసిబి అధికారుల అదుపులో ఉన్నారు.

# మతోన్మాదానికి మందు కమ్యూనిజమే..











**-ఎర్ర జెండాల ఐక్యతతోనే బలోపేతం**
**-రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న బిజెపి**
**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**
**-ఎరుపెక్కిన మణుగూరు.. స్మారక స్తూపం ఆవిష్కరణ**

**ప్రజాపక్షం/ఖమ్మం/ భద్రాచలం :** మతోన్మాదాన్ని అడ్డుకోగలిగింది కమ్యూనిస్టులు మాత్రమేనని, మత ఉన్మాదానికి మందు కమ్యూనిజమేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. దేశ ప్రజల్లో మతం మత్తు నింపాలని బిజెపి ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగిడిన సందర్భంగా శనివారం మణుగూరు అరుణా వర్ణం పులుముకుంది. బొగ్గు బావులకు నిలయమైన మణుగూరులో కమ్యూనిస్టులు కదం తొక్కారు. భారీ ప్రదర్శన అనంతరం మణికంఠ నగర్ సమీపంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ దేశ వ్యాప్తంగా శత వసంత ఉత్సవాలను జరుపుకుంటుందని అందులో భాగంగా 99 ఏళ్ల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ చరిత్రను, పార్టీ ఎదుర్కొన్న నిర్బాంధాలను, సాధించిన పోరాట విజయాలను, త్యాగాలు చేసిన అమరుల చరిత్రను నేటి తరాలకు తెలియజేసి కార్యోన్ముఖులను చేసేందుకు సభలను నిర్వహిస్తున్నట్లు కూనంనేని తెలిపారు. ఆవిర్భావమే నిర్బంధంతో ప్రారంభమైందని అప్పుడు పరాయి దేశం వాడు కమ్యూనిస్టులపై కుట్ర కేసులు పెడితే

మిగతా 2లో..

## పెరిగిన సైబర్ నేరాలు



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ప్రజలలో సైబర్ నేరాలపై పూర్తిస్థాయిలో అవగాహనలేకపోవడం వలనే కేటుగాళ్లు రెచ్చిపోతున్నారని ఫలితంగా అమయకులు వారి వలలో పడి ఆర్థికంగా నష్టపోతున్నారని పోలీస్ కమిషనర్ సునిల్ దత్ అన్నారు. శనివారం స్థానిక సిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మిగతా 2లో..

**-ప్రజల అప్రమత్తతోనే నేరాల నియంత్రణ**
**-టాఫిక్ క్రమబద్ధికరణకు ప్రత్యేక చర్యలు**
**-గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక నిఘా**
**-పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ వెల్లడి**
**-వార్షిక నివేదిక విడుదల**

## అమరుల త్యాగం అజరామరం

**-రామానుజవరంలో అమరుల పైలాన్ ఆవిష్కరణ**



**ప్రజాపక్షం/ఖమ్మం :** అమరుల త్యాగాలు అజరామరమని వారి త్యాగాల ఫలితంగానే వందేళ్ల తర్వాత ఇంకా ఎర్ర జెండాల రెపరెపలను చూస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మణుగూరు మండలం రామానుజవరంలో భారత కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి అమరులైన వారి స్మృతి చిహ్నంగా పైలాన్‌ను సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయోధ్య నేతృత్వంలో నిర్మించారు. రామానుజవరం గ్రామం కమ్యూనిస్టు పార్టీకి కంచుకోట. ఒకప్పుడు

మిగతా 2లో..

# మతోన్మాదానికి మందు కమ్యూనిజమే..

(మొదటిపేజీ తరువాయి)

స్వాతంత్ర్య అనంతరం కూడా కమ్యూనిస్టులకు నిర్బంధాలు తప్పలేదన్నారు. కమ్యూనిస్టులు లేకుంటే సంపూర్ణ స్వాతంత్ర్యం పిలుపే లేదని కూనంనేని స్పష్టం చేశారు. భారతదేశపు నడిబొడ్డున మరో కశ్మీర్‌లా నిజాం రాజ్యం మిగిలేదని కానీ కమ్యూనిస్టుల వీరోచిత పోరాటం, అనన్య త్యాగాలు నైజాంను గద్దె దింపి తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేశారని ఆయన తెలిపారు. నాలుగున్నర వేల మంది అమరుల బలిదానం తర్వాత తెలంగాణ భారతదేశంలో విలీనమైందని తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణక్షర లిఖితమన్నారు. భారతదేశంలో కార్మికులు, కర్షకులు, పేద, మధ్యతరగతి ప్రజల పక్షాన నికరంగా పోరాడుతున్న ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనని అనేక హక్కులు సాధించిందని కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే భూసంస్కరణ చట్టాల చట్టం, బ్యాంకుల జాతీయకరణ, సమాచార హక్కు చట్టం, జాతీయ ఉపాధి పథకం సహా పలు చట్టాలు, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని సాంబశివరావు తెలిపారు. నిరంతరం ప్రజల కోసం పాటుపడుతున్న కమ్యూనిస్టు పార్టీ పురోగమనం తప్పదని శత వసంత వేళ పార్టీ వ్యక్తులు, శక్తులలో నూతనోత్తేజం నింపి ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని ఆయన స్పష్టం చేశారు. బిజెపి అభివృద్ధిని మరిచి మతం మత్తులో దేశ ప్రజలను ముంచి మోసం చేస్తుందని బిజెపి పాలనలో లౌకిక వాదం భారత రాజ్యాంగం కూడా ప్రమాదంలో పడ్డాయని కూనంనేని ఆరోపించారు. ఎర్ర జెండాల ఐక్యతే జాతీయ, రాష్ట్ర స్థాయిలో ప్రత్యామ్నాయ శక్తిగా కమ్యూనిస్టులు ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ఏ లక్ష్యం కోసం ఎర్ర జెండా పుట్టిందో ఆ లక్ష్య సాధనకు ఐక్యత దోహద పడుతుందని ఐక్యతకు ముందుకు రావాలని కమ్యూనిస్టు పురోగామి శక్తులకు ఆయన పిలుపునిచ్చారు. భూమి కోసం భుక్తి కోసం కష్ట జీవుల సంక్షేమం కోసం వందేళ్ల క్రితం ఆవిర్భావించిన భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన పోరాటాలకు



పునరంకితమవుతుందన్నారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె సాబీర్ పాషా, బొల్లోజు అయోధ్య, సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దబ్బాయి), సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాస్, ఆర్. లక్ష్మి నారాయణ, దుగ్యాల సుధాకర్, జే.మోహన్‌రావు, అనంతనేని సురేష్, రాంగోపాల్, మువ్వా వెంకటేశ్వరరావు, సతీష్, మల్లికార్జునరావు, కె. రామారావు, మనోహర్, వెంకటేశ్వరరావు, రాజబాబు, వీరభద్రం పాల్గొన్నారు.

**మణుగూరులో భారీ ప్రదర్శన...**

భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత సభను పురస్కరించుకుని మణుగూరు అరుణావర్ణమైంది. ఎర్ర జెండాల రెపరెపలు కమ్యూనిస్టు శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని ఇచ్చాయి. కోల్డ్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన సురక్ష బస్టాండ్, సిపిఐ ఆఫీస్, అంబేడ్కర్ సెంటర్ మీదుగా మణికంఠ నగర్ ప్రాంతానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో హాజరైన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల నినాదంతో పారిశ్రామిక ప్రాంతం మణుగూరు ప్రతిధ్వనించింది. ప్రదర్శన అగ్రభాగాన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, కార్యవర్గ సభ్యులు ఎస్‌కె సాబీర్ పాషా, బొల్లోజు అయోధ్య, సీనియర్ నాయకులు పాకాలపాటి వెంకటేశ్వరరావు (పెద్దబ్బాయి), సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి తదితరులు నడిచారు.

# అమరుల త్యాగం అజరామరం

(మొదటిపేజీ తరువాయి)

దట్టమైన అడవులతో నిండి ఉండే ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వాన అనేక గ్రామాలను నిర్మించారు. ఈ ప్రాంతంలో అనేక నిర్బంధాలను, కేసులను ఎదుర్కొని కమ్యూనిస్టు పార్టీ పురోగమించింది. ఒక పక్క పోలీసులు, అటవీ అధికారులు, మరోపక్క మావోయిస్టులు కమ్యూనిస్టు పార్టీని ఈ ప్రాంతంలో లేకుండా చేసేందుకు విశ్వ ప్రయత్నాలు చేసిన రామానుజవరం ప్రాంతంలో ఎర్ర జెండా రెపరెపలను నిలువరించలేకపోయారు. కమ్యూనిస్టు పార్టీ ఈ ప్రాంతంలో పురుడుపోసుకున్న నాటి నుండి నేటి వరకు పార్టీలో పనిచేస్తూ అమరులైన వారి స్మృతి చిహ్నంగా భారీ పైలాన్‌ను ఆవిష్కరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు అరుణపతాకాన్ని ఆవిష్కరించారు.పైలాన్‌ను ఆవిష్కరించిన అనంతరం బాడిస సతీష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగాలు అజరామరమని వారి స్ఫూర్తితోనే భవిష్యత్తు పోరాటాలు రూపుదిద్దుకోనున్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీలో పనిచేయడం ఒక వరంగా భావించాలని ఆయన నేటి తరానికి సూచించారు. వారి త్యాగాలను నిరంతరం మననం చేసుకుంటూ పురోగమిస్తామని కూనంనేని తెలిపారు.

**ఎర్ర జెండా గుండెల్లో పదిలమే : ఎంఎల్‌ఏ పాయం**

నేను ఎక్కడున్నా నా గుండెల్లో ఎర్ర జెండా పదిలంగా ఉంటుందని పేదల కోసం నిరంతరం పాటుపడుతున్న కమ్యూనిస్టు పార్టీ మరో వందేళ్లు వర్ధిల్లాలని పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు



అన్నారు. పైలాన్ ఆవిష్కరణలో పాల్గొన్న పాయం మాట్లాడుతూ తాను కమ్యూనిస్టు పార్టీలోనే రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని విద్యార్థి నాయకునిగా పనిచేశానని, యువజన ఉద్యమంలోనూ, పార్టీలోనూ పనిచేసిన తాను ఎర్ర జెండాను ఎప్పటికి మరువబోనన్నారు. ఈ దేశంలో వందేళ్లు నీతివంతంగా ప్రజల పక్షాన పనిచేసిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. కమ్యూనిస్టు భావజాలంతోనే ఏ పార్టీలో ఉన్న పనిచేస్తున్నానని పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను పేదలకు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, బి. అయోధ్య, పాకాలపాటి వెంకటేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మి కుమారి, కె. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చిందేసిన ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఒక విప్లవ గీతానికి నృత్యం చేసి సభికులను ఉత్తేజపరిచారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంత సభ శనివారం మణుగూరులో జరిగింది. ఈ సందర్భంగా ఒక విప్లవ గీతానికి పార్టీ సహచరులతో కలిసి ఆయన నృత్యం చేశారు. సాంబశివరావు నృత్యం చేయడంతో సభికులు ఆనందోత్సవాలతో చప్పట్లు కొడుతూ ఉత్తేజపరిచారు. గంభీరమైన ఉపన్యాసాలు ఇచ్చే కూనంనేని పాటకు నృత్యం చేయడం



చూసి కార్యకర్తలు ఆశ్చర్య చకితులయ్యారు. కూనంనేనితో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య తదితరులు నృత్యం చేసిన వారిలో ఉన్నారు.

# పెరిగిన సైబర్ నేరాలు

(మొదటిపేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఈ ఏడాది నేరాలకు సంబంధించిన వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. గడిచిన ఏడాది కంటే ఈ ఏడాది నేరాలు పెరిగాయని వాటిలో ఎక్కువ సైబర్ మోసాలే ఉన్నాయన్నారు. గత ఏడాదిలో సైబర్ నేరాలపై 1332 ఫిర్యాదులు రాగా ఈ ఏడాది 2148 వచ్చాయని వాటిలో 1820 పరిష్కరదిశగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. వీటిలో బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ మోసాలతో బాధితులు ఎక్కువగా నష్టపోయా రన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గంజాయి, మాధక ద్రవ్యాల కట్టడి చేశామన్నారు. కమిషనరెట్ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది ప్రాపర్టి ఎఫైన్స్‌లు 466 ఫిర్యాదులు రాగా ఈ ఏడాది 700 వచ్చాయని వాటిలో 295 చేధించి నిందితుల నుంచి 15,598 సొత్తు రికవరి చేశామన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ఇల్లలో జరిగిన చోరిలపై ఈ ఏడాది 230 ఫిర్యాదులు రాగా స్నాచింగ్ కేసులు 32, ద్విచక్రవాహనాలు, చిన్నచిన్న దొంగదనాలు 431 వచ్చాయన్నారు. కుటుంబకలహాలు,మహిళలపై వేదింపులు, ఆస్థి, భూవివాదాలపై 26 కేసులు ఆయా పోలీసు స్టేషన్‌లలో నమోదైయ్యాయాన్నారు. నేరాల చేధించడంలో సిసి కెమెరాలు ఎంతో దోహదపడ్డాయన్నారు. వివిధ చోరిలలో నిందితులను పట్టుకునేందుకు సెంట్రల్ క్రైం సిబ్బంది 43 మంది నిందితులను పట్టుకుని వారి నుంచి 6,640,000 సొత్తు రికవరిచేసినట్లు సిపి వివరించారు. సెంట్రల్ ఎన్‌ఫోర్స్ విభాగం సిబ్బంది వివిధ ప్రాంతాల్లో పలువురు బాధితులు సెల్‌ఫోన్‌లు చోరిలకు గురైనట్లు ఫిర్యాదులు రాగా వాటిలో 1,075 రికవరి చేసినట్లు పేర్కొన్నారు. నిషేదిత గంజాయి, డ్రగ్స్ అక్రమంగా తరలిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుల్లో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 10,53,600/ విలువ చేసే 42.420 కేజీల సిజ్‌చేసినట్లు వివరించారు. వివిధ ప్రాంతాల్లో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చేపట్టిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న 3,67,98,198/ విలువచేసే పిడిఎస్ బియ్యం, గంజాయిని స్వాధీనం చేసుకుని సదురు నిందితులను జైలుకు తరలించినట్లు తెలిపారు. ప్రధానంగా ప్రజల్లో నేరాలపై అవగాన పెరిగినప్పుడే వాటిని నియంత్రించడం సాధ్యమన్నారు. వరదల సమయంలో పోలీసు అధికారులు, సిబ్బంది అందించిన సేవలను సిపి కొనియాడారు. శాంతిభద్రతలు పరిరక్షణ, నేరాల కట్టడికి పోలీసు సిబ్బంది, అధికారులు అంకితబావంతో పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపిఎస్ అధికారి రుత్విక్, డిసిపి, ఏసిపిలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, రమణమూర్తి, తిరుపతిరెడ్డి, రహెమాన్, శ్రీనివాసులు, రవి, సాంబరాజు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజా సమస్యల పరిష్కారం కోరకు ఉద్యమించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు చేయాలని గ్రామ స్థాయి నుంచి ఆందోళన లు చేపట్టాలని సూచించారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసందని అన్నారు. ప్రభుత్వం తీరు మారకపోతే ప్రత్యక్ష ఆందోళన చేస్తామని హెచ్చరించారు. తడిసిన ధాన్యం ను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్ని గ్రామాలకు క్యాలెండర్స్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, నేలకొండపల్లి సోసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, నాయకులు శీలం వెంకటలక్ష్మి, పాకనాటి గోపిరెడి మరికంటి రేణుబాబు, గొలుసు రవి మాదాసు ఆదాం, కమదన ప్రవీణ్, ఉస్సేన్, కనుక ప్రసాద్, నేరళ్ల నరసింహారావు, సోడెపోంగు ప్రశాంత్, శంకర్, సామేల్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఏజెన్సీ గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

## కూనంనేని సమక్షంలో 20 కుటుంబాలు సిపిఐలో చేరిక



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి:** లక్ష్మీ దేవిపల్లి మండల పరిధిలోని ఉమ్మడి రేగళ్ల గ్రామపంచాయతీకి చెందిన 20 కుటుంబాలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సమక్షంలో పార్టీలో చేరారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్‌లో వీరికి పార్టీ ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐని జనం ఆదరిస్తున్నారని, ఇది ప్రజలకు పార్టీ అందిస్తున్న సేవల ఫలితమేనని అన్నారు. నూతనంగా చేరుతున్న నాయకులు ప్రజా సంఘాల్లో భద్రతలు తీసుకొని సేవలందించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. రేగళ్ల పరిసర గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామీణ రహదారులు విద్యుత్, అంతర్గత రోడ్లు, త్రాగు, సాగునీరు అందించేందుకు నిత్యం కృషి జరుగుతుందన్నారు. మారినేని మాధవరావు, షేక్ పాషా, దళవాయి వినయ్, శెట్టుపల్లి శివాజి, షేక్ అన్వర్‌పాషా, వాసం శివకృష్ణ, పడిగ అభిలాష్, వట్టం హరి, గంగుల రమేష్, దడవాయి వెంకటేశ్వర్లు తదితరులు సిపిఐలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, నాయకులు కంటెం శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఉద్యమాలను బలపరచండి : నున్నా



**ప్రజాపక్షం/వైరా:** ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం ప్రజా ఉద్యమాలనుప్రజలు శ్రేయోభిలాషులు బలపరిచి అన్ని విధాలుగా పార్టీ విస్తరణకు సహకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. శనివారం సిపిఎం వైరా డివిజన్ కమిటీ సమావేశం వైరా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో తాళ్లపల్లి కృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ వైరా నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యలపై పోడు రైతులు కార్మికులు మహిళలు అన్ని వర్గాల ప్రజల పక్షాన పోరాడింది సిపిఎం అని చెప్పారు. భవిష్యత్తు ఉద్యమ పోరాటాలు కోసంప్రజలు అన్ని విధాలుగా సిపిఎంను సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జనవరి మూడో వారంలో జరిగే సిపిఎం రాష్ట్ర మహాసభల విజయవంతం కోసం అందరూ సహకరించాలని కోలరారు. సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సమస్యలు ముఖ్యమైన వాటిపై పోరాటాల రూపకల్పన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జనవరి మొదటి వారం నుంచి డివిజన్ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. రూపకల్పన కోసం జనవరి 2న వైరా డివిజన్ పార్టీ శ్రేణులతో వర్క్‌షాప్ ఏన్కూరు మండల కేంద్రంలో జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, కొండబోయిన నాగేశ్వరరావు, దుగి కృష్ణ, పార్టీ మండలాల కార్యదర్శులు చింతనిప్పు చలపతిరావు, దొంతబోయిన నాగేశ్వరరావు, చెరుకుమల్లి కుటుంబరావు, కె.నరేంద్ర, బాణాల శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరెడ్డి, డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధి పనులకు యాక్షన్ ప్లాన్



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంచాయతీ అభివృద్ధి పనులకు యాక్షన్ ప్లాన్ ను ప్రతీ పంచాయతీలలో సిద్ధం చేసినట్లు నేలకొండపల్లి ఎంపీడీవో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ యం.యర్రయ్య పేర్కొన్నారు. శనివారం నేలకొండపల్లి మేజర్ పంచాయతీ లో జీపీడీపీ గ్రామ సభ ను నిర్వహించారు. సభలో గత బడ్జెట్..పనుల వివరాలను చదివి వినిపించారు. 202526 సంవత్సరం కు సంబంధించి తాత్కాలిక యాక్షన్ ప్లాన్ పై చర్చించారు. గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పనులను సభ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పోర్టల్ లో నమోదు చేయాలని స్పెషల్ ఆఫీసర్ ఆదేశించారు. అదే విధంగా అత్యవసరమైన పనులను గుర్తించారు. బడ్జెట్ కు తగ్గట్టుగా అంచనాలు తయారు చేయనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాదికి సంబంధించిన బడ్జెట్ అంచనాల యాక్షన్ ప్లాన్ ను అన్ని పంచాయతీలలో సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సభలో మాజీ సర్పంచ్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ బోందయ్య, కాసాని నాగేశ్వరరావు, కడియల నరేష్, వంగవీటి రవి, నకిరికంటి సత్యనారాయణ, గ్రామ దీపికలు పార్వతీబాయి, ఉమా, అనిత, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత వీడాలి

## నిరసన దీక్షలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు జమలయ్య



**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్:** గ్రామపంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వాతానికి తీరునే ప్రదర్శిస్తూ ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే రీతిలో వివక్షత ప్రదర్శిస్తుందని ఏఐటియుసి జిల్లా అద్యక్షులు కంచర్ల జమలయ్య ఆరోపించారు. డిమాండ్ల పరిష్కారం కోరుతూ కార్మిక సంఘాల జేఏసి పిలుపు మేరకు బస్టాండ్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం జమలయ్య మాట్లాడుతూ కనీస వేతనాలు అమలు చేయాలని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నో ఉద్యమాలు నిర్వహించినప్పటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని విస్మరించి ఆ ఉద్యమాల పట్ల నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, ప్రజల కనీస అవసరాలు తీరుస్తున్న కార్మికులకు చట్టబద్ధమైన వేతనాలు అమలు చేయకుండా వారి శ్రమను దోచుకుంటున్నారని, కార్మికులకు పని భద్రత కరువవుతుందని అన్నారు. కనీస వేతనం రూ.26లు చెల్లించాలని ప్రభుత్వం జారీ జీవో ప్రకారం స్వీపర్లకు రూ.15వేలు, ఇతర విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ.19500లు చెల్లించాల్సి ఉండగా ఈ జీవో ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదని, ప్రమాదం జరిగి మృతి చెందిన, గాయాలపాలవుతున్న కార్మికులకు ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదన్నారు. మల్టిపర్పస్ విధానంతో కార్మికులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రమాద భీమా, గ్రాట్యూటీ సెలవుల అమలు, గుర్తింపకార్డులు, కార్మిక చట్టాల అమలు వంటి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల శ్రీనివాస్, ఎండి.యూసుఫ్, దుంపల అమర్‌నాధ్, కిషోర్‌కుమార్, సలీం, రామకృష్ణ, మంజుల, షరీఫ్, ప్రవీణ్, వంశీ, శ్రీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన క్యాలండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ సత్తుపల్లి :** నూతన సంవత్సర క్యాలండర్‌ను తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు శనివారం ఆవిష్కరించారు. 4వ వార్డు కౌన్సిలర్ మట్టా ప్రసాద్, 17వ వార్డు కౌన్సిలర్ వేములపల్లి పుష్పలతమదుల ఆద్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర క్యాలండర్‌ను పట్టణంలోని గుడిపాడులో గల మువ్వా నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మువ్వా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల కృష్ణయ్య, మట్టా ప్రసాద్, దొడ్డా కిషోర్, దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు), పిడుగు సత్యనారాయణ, వేములపల్లి మదు, నరుకుళ్ళ సత్యం, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాస రచన పోటీల్లో టాలెంట్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పట్టణంలోని సిద్దారం రోడ్డులో గల టాలెంట్ స్కూల్ విద్యార్ధులు రామకృష్ణ , వివేకానంద భావ ప్రచార పరిషత్ తెలంగాణ వారి ఆద్వర్యంలో శనివారం సత్తుపల్లి డివిజన్ స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చి ప్రదమ, ద్వితీయ బహుమతులు సాధించారు. టాలెంట్ టెస్ట్‌లో ముస్పాల కావ్య ప్రదమ బహుమతిని, కొట్టే మౌనిష ద్వితీయ బహుమతిని సాధించి రామకృష్ణ మఠం వివేకానంద స్వామిజీ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. విజేతలను టాలెంట్ స్కూల్ ప్రిన్స్‌పాల్ పులి శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంచార్జ్ శంకర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమవిందులో ఎంఎల్‌ఏ మట్టా దంపతులు



**ప్రజాపక్షం/ సత్తుపల్లి :** క్రిస్మస్ పర్వదినం సందర్బంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆద్వర్యంలో క్రిస్టియన్ సోదరులు, పాస్టర్స్‌కు ఏర్పాటు చేసిన ప్రేమవిందుకు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్‌కుమార్ దంపతులు హాజరైనారు. శనివారం పట్టణంలోని సిద్దారం రోడ్డులో గల శ్రీ లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ప్రేమవిందులో పాల్గొన్న ఎంఎల్ఏ డా.మట్టా రాగమయి మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరులకు తెలంగాణ ప్రభుత్వం అండదండలుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమాప్యాయతలతో కలిసి ఉండాలని, కుల,మత బేదాలు వీడి సోదరభావంతో కలిసి,మెలసి ఉండాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా క్రిస్టియన్ సోదర. సోదరీమణులకు ప్రేమవిందును ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, వైస్ చైర్ పర్సన్ తోట సుజలరాణి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అద్యక్షుడు గాదే చెన్నకేశవరావు ,పింగళి సామ్యూల్, కమల్‌పాషా, చల్లగుళ్ళ నర్సింహరావు, హోప్ మినిస్ట్రీస్ నిర్వాహకులు సామ్యూల్ జాషువా, ఎన్‌సిసి అద్యక్షులు అలవాల కరుణాకర్ పాల్గొన్నారు.

# వివేకానంద స్పూర్తితో ముందుకు సాగాలి




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** భరతఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన ఘనుడు వివేకానందుడని, వివేకానంద స్పూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ . శనివారం రామకృష్ణ ,వివేకానంద భావ ప్రచార పరిషత్ 6వ భక్త సమ్మేళనము మొదటి రోజు కార్యక్రమం శనివారం పట్టణంలోని మాదురి ఫంక్షన్ హాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్‌కుమార్, రామకృష్ణ మఠం హైద్రాబాద్ శాఖ అద్యక్షులు స్వామి భోదమయానందజీలు హాజరైనారు. ముందుగా పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుండి మాదురి ఫంక్షన్ హాల్ వరకు విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎంఎల్ఏ డా.మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి డివిజన్ లోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఆధ్యాత్మిక సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

# పంచాయతీ వర్కర్స్ సమస్యల పరిష్కరించాల్సిందే..



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** గ్రామ పంచాయతీ వర్కర్స్ సమస్యల ను వెంటనే పరిష్కరించాల్సిందేనని యూనియన్ మండల అధ్యక్షుడు రహిముతుల్లా డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరుతూ, శనివారం మండల కేంద్రంలో సమ్మె దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పంచాయతీలలో పని చేసే మల్టీఫర్పస్ వర్కర్స్ సమస్యల సాధన కోసం రాజీలేని పోరాటాలు చేస్తామని అన్నారు. వెంటనే జీవో 60 ప్రకారం జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు వంగూరి నాగరాజు, వాచేపలి అనిత వెంకటేశ్వరు, బొడు ఆంజనేయులు కస్తల గోపయ్య, బచ్చలికూర వేంకటేశ్వర రావు, వీరికి సంఘిబావంగా ప్రజాపంధా డివిజన్ నాయకులు పగిడికత్తుల రామదాసు తదితరులు పాల్గొన్నారు.

## 29న ఆలయంలో రుద్రహోమం



ప్రజాపక్షం/పాల్వంచ టౌన్: కేశవాపురంజగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనక దుర్గ దేవస్థానము(పెద్దమ్మగుడి) నందు మాస శివరాత్రి రోజున జరిగే రుద్రహోమం ఈనెల 29వ తేదీన ఉదయం 9గంటల నుండి మధ్యహ్నం 1గంట వరకు ఆయ ఆవరణలో గల యాగశాలలో అత్యంత వైభవంగా, శాస్త్రోక్తముగా నిర్వహించడం జరుగుతుంది. కలియుగములో మానవులకు సంప్రాప్తించే కష్ట, నష్టముల నుండి విముక్తి కలిగించే మహిమాన్వితమైన హోమము రుద్రహోమమని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఇట్టి రుద్ర హోమములో పాల్గొన్న వారికి రుద్రుడు కష్టములు, దారిద్ర్యము, రుణబాధలు, ఇతర ఇబ్బందుల నుండి విముక్తులను చేసి ఆయురారోగ్య, అష్టైశ్వర్యాను కలుగజేస్తారు. ఈ రుద్రహోమంలో పాల్గొను భక్తులు ముందుగా గానీ, అదే రోజు గానీ రూ 1,516లను కట్ట ఇగోత్రనామములు నమోదు చేసుకొని హోమంలో పాల్గొనాలి. పాల్గొన్న దంపతులకు శేషవస్త్ర ప్రసాదము అందజేస్తారు. హోమంలో పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తులు అనగా మగవారు ధోతి, కండువాను ధరించి, ఆడవారు పేర సంకల్పం చేసి హోమము నిర్వహిస్తారు. పూర్తి వివరములకు ఫోన్ నెం 6303408458ల వారిని సంప్రదించాలన్నారు.

## పాల్వంచలో కేక్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న కొత్వాల



ప్రజాపక్షం/పాల్వంచ: పాల్వంచలో అంబేద్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కేక్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. శనివారం కేక్ ఫ్యాక్టరీని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు కొత్వాల ప్రారంభించారు. ఈసందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కేక్ ఫ్యాక్టరీలో వినియోగదారులకు నాణ్యమైన, రుచికరమైన పదార్థాలను అందించేలా చూడాలన్నారు. సామాన్యులకు సైతం ధరలు అందుబాటులో వుండాలన్నారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు వాంకోడోత్ నర్సింహారావు, వాంకోడోత్ గోపి, మాజీ జెడ్పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, సిపిఐ నాయకులు భాగం హేమంతరావు, ఎస్‌కే సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు కందుకూరి రాము, పైడిపల్లి మహేష్, ఉండేటి శాంతివర్ధన్, మాలోత్ కోటి నాయక్, బానోత్ బాలూ నాయక్, బాదావత్ సామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దీక్షా శిబిరానికి ఏఐటీయూసి, జేఏసి నాయకులు సంఘీభావం



ప్రజాపక్షం/జూలూరుపాడు: గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మెలో భాగంగా జూలూరుపాడు ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఏఐటీయూసి జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య, జిల్లా జేఏసీ నాయకులు ఏదులాపురం గోపాలరావు, ఎండి యూసుఫ్, యాసా నరేష్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామపంచాయతీ కార్మికుల జేఏసీ నాయకత్వాన్ని పిలిచి చర్చలు జరపాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గంగారం పంచాయితీ ఆకస్మికంగా తనికీ



ప్రజాపక్షం/ సత్తుపల్లి : మండల పరిధిలోని గంగారం గ్రామ పంచాయితీని (స్థానిక సంస్థల) జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజశనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి, కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పన్ను వసూలు 100 శాతం పూర్తి చేయాలని, వసూలైన నగదుకు సంబందించి గ్రామ పంచాయితీ అకౌంట్‌కు జమ చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయితీలోని అన్ని రికార్డులను ఖచ్చితంగా నిర్వహించాలని, క్యాష్ పుస్తకాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. గ్రామ పంచాయితీలోని నర్సరీలలో బ్యాగ్ ఫిల్లింగ్ త్వరగా పూర్తి చేసి గ్రామస్థులు కోరిన మొక్కలను నర్సరీలో పెంచాలని, బతికి ఉన్న మొక్కల రిజిస్టర్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ నెల 31 వరకు గ్రామ పంచాయితీలో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పూర్తి చేయవలసిందింగా అదేశించటమే కాకుండా సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం, అలసత్వం, ఉదాసీనత ప్రదర్శిస్తే అటువంటి వారిపై శాఖాపరమైనటువంటి క్రమ శిక్షణా చర్యలు తీసుకొనబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పంచాయితీ అధికారి రాంబాబు, ఎంపిడిఓ, ఎంపిఓ,పంచాయితీ కార్యదర్శులు తదితరులున్నారు.

# డెంగ్యూతో మంచం పట్టిన రాజారం..!

**-పది మందికి పైగా డెంగ్యూ జ్వరాలు**
**-ఇటీవలే డెంగ్యూతో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి**
**-పత్తాలేని ఏఎన్ఎంలు, పర్యవేక్షణ లేని వైద్యాధికారిణి**
**-వైద్య శిబిరంకై జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు వేడుకోలు**









ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : నిత్యం గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తూ సేవలు అందించాల్సిన ఏఎన్ఎంల పత్తాలేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఏఎన్ఎం ల పై పర్యవేక్షణ చేయాల్సిన వైద్యాధికారిణి పట్టించుకోకపోవడంతో వారు ఆడిందే ఆటగా పాడింది పాటగా చుట్టం చూపుగా విధులకు హాజరవుతూ ప్రజారోగ్యం పట్ల చిన్న చూపు చూస్తున్నారు. ఫలితంగా ఓ మహిళ డెంగ్యూతో మృత్యువాతపడింది. తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాజారం గ్రామంలో సుమారుగా పది మందికి పైగా ప్రజలు డెంగ్యూ జ్వరాల బారిన పడ్డారు. గత రెండు వారాలుగా ఒక్కొక్కరు నీరసించిపోయి విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతూ మంచాన పడ్డారు. ఒకరిద్దరు నుండి మొదలైన జ్వరం కాస్తా పది మందికి పైగా సోకి డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలుగా మారాయి. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇటీవలే ఓ మహిళ మరణించగా, కొందరికి తగ్గు ముఖం పట్టింది. ఇంకా మరికొందరు డెంగ్యూతో బాధపడుతూనే ఖమ్మం నగరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూనే ఉన్నారు.

**ప్రజారోగ్యం పట్టని ఏఎన్ఎం లు, వైద్యాధికారిణి**

ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వ వైద్య ఉద్యోగులుగా సంబంధిత సబ్ సెంటర్ లో నివాసం అంటూ గ్రామాల్లోని ప్రజలకి వైద్య సేవలు అందించాల్సిన ఉద్యోగులు విధుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. విధి నిర్వహణను గాలికి వదిలేసి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సుదూర ప్రాంతాల నుండి ఏఎన్ఎం లు విధులకు హాజరవుతున్నారు. గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యానికి గురైన విషయం పట్ల వారికి కనీస అవగాహన లేకపోవడం గమనార్హం. వీరి పై అజమాయిషీ చేయాల్సిన వైద్యాధికారిణి వివాదాలకు కేరాఫ్ నిలవడంతో ప్రజలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. డెంగ్యూ జ్వరాలతో మంచం పట్టిన రాజారం గ్రామం పై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక శ్రద్ద చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**పారిశుధ్య నిర్వహణలో కార్యదర్శి నిర్లక్ష్యం...**

పారిశుధ్య నిర్వహణలోపంతోనే రాజారం గ్రామంలో ప్రజలు డెంగ్యూతో మంచాన పడ్డారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వీదుల్లో ఎక్కడ చూసినా బురద, చెత్తా చెదారం ఉందని, శుభ్రం చేపించి చెత్తను తీయించి బ్లీచింగ్ చల్లాలని అనేక సార్లు చెప్పిన వినిపించుకోలేదని గ్రామస్తులు వాపోయారు. సుమారుగా మూడు వారాల క్రితమే గ్రామంలో ఒకరిద్దరు జ్వరం బారిన పడిన విషయాన్ని స్వయంగా చెప్పిన పట్టించుకోలేదని ఫలితంగా పది మందికి పైగా గ్రామస్తులు డెంగ్యూ, విషజ్వరాలతో మంచం పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాలం తీరిన నాసిరకం బ్లీచింగ్ ను వీధుల్లో చల్లించారని స్థానికులు మండి పడుతున్నారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ స్పందించి ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంతో పాటుగా విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి, ఏఎన్ఎంలు, కార్యదర్శి పై విచారణ క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులను సస్పెండ్ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా గ్రామంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## మండల విద్యా వనరుల కేంద్రం గేట్లు తెరుచుకునేది ఎన్నడో..!?

**-ఈ కార్యాలయంలో ఉండేది ఎవరు..**
**-సమగ్ర శిక్షణ ఉద్యోగుల పరిస్థితి ఏమిటి**





ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలో మండల విద్యా వనరుల కేంద్రం గేట్లు తెరుచుకునేది ఎన్నడని మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విసుగు చెందుతున్నారు. సమగ్ర శిక్షణ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంకై రాష్ట్ర సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల మండలాల నుండి సమగ్ర శిక్షణ ఉద్యోగులు 22 రోజులుగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో వారి డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా చేస్తున్నారు. ధర్నా నిమిత్తమై అశ్వాపురం మండలం నుండి కూడా ఉద్యగులు ధర్నాలో పాల్గొనడం వల్ల మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయుల విద్యార్థుల సర్వీసులు అన్నీ కూడా నిలిచిపోయాయి. వీరి బాధ్యత మొత్తం ప్రస్తుతం మండల విద్యాశాఖ అధికారి మాత్రమే భరించాల్సి వస్తుంది. ఈ మండల విద్యా వనరుల కేంద్రం కింద సుమారుగా 8 మంది సమగ్ర శిక్షణ ఉద్యోగులు వారి వృత్తిని కొనసాగిస్తున్నారు. ప్రతి రోజు మండలంలోని 24 గ్రామాలలోని ప్రాథమిక, ఉన్నత, జిల్లా పరిషత్, ప్రైవేటు పాఠశాలలోని, మూడు కాంప్లెక్స్ కింద ప్రతి ఉపాధ్యాయుడికి, విద్యార్థులందరికీ అందించే బియ్యం, పుస్తకాలు, డేటా ఎంట్రీ, ఉపాధ్యాయుల బదిలీలు, హాజరు, విద్యార్థులందరికీ అందించే బియ్యం, పుస్తకాలు, డేటా ఎంట్రీ, ఉపాధ్యాయుల బదిలీలు, సవరణలు, దివ్యాంగ పిల్లలకు లాంటి సుమారుగా చాలా సర్వీసులను సమగ్ర శిక్షణ ఉద్యోగులు చేయాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగులకు పని భారం ఎక్కువ వచ్చే వేతనం తక్కువ అంతే కాకుండా ఈ మూడు కాంప్లెక్స్ పాఠశాలలకు సీఆర్పీలు వారి స్వంత వాహనాలలో తిరిగాల్సి ఉంటుంది. కనీసం వారికి అలవెన్స్‌లు కూడా ఇవ్వకుండా కనీస వేతనం ఇవ్వకుండా , ఉద్యోగులను బానిసలుగా చూస్తుందని సమగ్ర శిక్షణ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. డిమాండ్లు పరిష్కరించేంత వరకు విధుల్లో చేరేది లేదని వారు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వారి డిమాండ్లను పరిశీలించి త్వరగా పరిష్కరించి మరల వారిని వారి విధుల్లో కొనసాగించే విధంగా చేయాలని మండల విద్యాశాఖ అధికారులు, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాపక్షం/భద్రాచలం : ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తామని దగా చేసే దళారులను నమ్మవద్దని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, సిబ్బంది లబ్ధిదారుల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండి విపి గౌతమ్ అన్నారు. శనివారం దుమ్ముగూడెం మండలంలోని డికొత్తగూడెం గ్రామంలో ఇందిమ్మ ఇండ్ల దరఖాస్తు దారులతో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపై దరఖాస్తు దారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని, దరఖాస్తు దారులు తప్పని సరిగా వారికి సంబంధించిన డాక్యుమెంట్లు సర్వేకి వచ్చే అధికారులకు అందిచి సందేహాలుంటే తెలుకుని సర్వే కచ్చితంగా చేయాలన్నారు. లబ్ధిదారుల ప్రస్తుత పరిస్థితులను పూర్తి స్థాయిలో పరిశీలించి ఫొటోలతో పాటు అప్‌లోడ్ చేయాలన్నారు. సర్వే సిబ్బంది ప్రతీ అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ అశోక్, ఎంపిఓ రామకృష్ణ, హౌసింగ్ పిడి శంకర్, వెంకటేశ్వర్లు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాల మంజూరులో సర్వేను వేగవంతం చేయాలి

**-రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల**



ప్రజాపక్షం/పాల్వంచ: తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం చేపడుతున్న ఇందిరమ్మ పక్కా గృహాల మంజూరులో సర్వే అధికారులు సర్వేను వేగవంతం చేయాలని రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాల్వంచ మున్సిపల్ కార్యాలయంలో కొత్వాలతో పాటు కాంగ్రెస్ నాయకులు కమీషనర్ కే సుజాతను కలిసి చర్చించారు. ఈసందర్భంగా కొత్వాల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో ఇచ్చిన పేదలకు 5లక్షలతో ఇంటి నిర్మాణానికి సాయం హామీ మేరకు ప్రజాపాలన సభలలో దరఖాస్తులు స్వీకరించిందన్నారు. మంజూరు విషయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సర్వే టీం చర్యలు చేపట్టాలని అన్నారు.

**లబ్ధిదారులు ఆందోళన చెందవద్దు : కొత్వాల**

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్దిదారుని వివరాలు సేకరించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారనీ, సర్వేలో ఆలస్యమైనా ఆందోళన చెందవద్దనీ కొత్వాల అన్నారు. లబ్దిదారుని ఇంటి స్థలంకు సంబంధించి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల లేకున్నా సాదాబైనామా, ఎగ్రిమెంట్ డాక్యూమెంట్లతో మంజూరు చేసేలా అధికారులను కోరామన్నారు. దరఖాస్తుదారు అడ్రస్ దొరకక పోయినా, దానిపై విచారించి ప్రతి ఒక్క దరఖాస్తును సర్వే చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈసమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జాలే జానకిరెడ్డి ఎల్‌డిఎం కోఆర్డినేటర్ బద్ది కిషోర్, మాజీ జెడ్పిటిసి యర్రం శెట్టి ముత్తయ్య, సొసైటీ డైరెక్టర్ కనగాల నారాయణ, కాంగ్రెస్ నాయకులు బాలినేని నాగేశ్వరరావు, కందుకూరి రాము, పైడిపల్లి మహేష్, కాపా శ్రీను, ఎస్‌కే చాంద్ పాషా, ఉండేటి శాంతివర్ధన్, మాలోత్ కోటి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



ప్రజాపక్షం/కరకగూడెం: నేతకాని కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర నేతకాని రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కావేరి చిన్నికృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగు మల్లయ్య కోరారు. శనివారం మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గ్రామంలో నేతకాని కులం గ్రామసభ కొండగుర్ల కోటి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ ముఖ్య సమావేశానికి ముఖ్య అతిధులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న క్రమంలో నేతకాని కులం ఏ కులంకి ఉప కులం కాదని, మేము తెలంగాణ రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 12 నుండి 15 లక్షల వరకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్నామని, ఇప్పుడు వర్గీకరణతో పాటు కులగణన చేస్తుంది కాబట్టి మహా నేతకాని కులం ఎంత జనాభా ఉందో లెక్క కట్టి మా సంఘాలకు అప్పజెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నామన్నారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణతో పాటు కులగణన చేసి అమలు పరిచినట్లయితే మా నేతకాని కులము ఏజెన్సీ ప్రాంతాలలో అదిలాబాద్ నుండి భద్రాచలం వరకు ఇరువైపులా గోదావరిని అనుకొని అటవీ ఉత్పత్తులపై ఆధారపడి ఆర్థికంగా వెనుకబడి విద్య, వైద్యం, ఉపాధికి దూరమై, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నామని, నేతకాని కులం పూర్వం నుండి గిరిజనులతో పాటు పోడు భూములు కొట్టుకొని జీవిస్తూ హక్కుపత్రాలు లేక, కార్పొరేషన్ సబ్సిడీ రుణాలు లేక, బ్యాంక్‌లు వ్యవసాయ రుణాలు లేక ధీనస్థితిలో కొట్టుమిట్టాడుతూ ఎవరికి చెప్పుకోలేక అట్టడుగు వర్గముగా మిగిలిపోయి ఉన్నామన్నారు. నేతకాని కులం ఏ కులానికి ఉప కులం కాదని కోరుకుంటూ కొన్ని ఎస్సీ ఉపకులాలు నేతకాని కులం పేరుతో రాజకీయంగా ఆర్థికంగా అభివృద్ధి అవుతున్నారన్నారు. మా నేతకాని కులం ఈజంచ ప్రాంతాలలో రాజకీయంగా వార్డ్ మెంబర్ నుండి ఏ పదవి దక్కడం లేదని వారన్నారు. భారతదేశానికి స్వతంత్రం వచ్చి 70 సంవత్సరాలు కావస్తున్నా మాకు ప్రభుత్వం నుండి ఎలాంటి అవకాశాలు కల్పించలేదని, ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినామా పరిస్థితులకు అనుగుణంగా ఏ ప్రభుత్వం కూడా పట్టించుకున్న దాఖలాలు లేవని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల వర్గీకరణ కులగణన అమలు చేస్తే మా నేతకాని జాతికి అన్ని రంగాలలో విద్య, ఉద్యోగ, ఉపాధి రాజకీయంగా అభివృద్ధి పరిచి ఆదుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తా ఉన్నామన్నారు. లేని పక్షంలో నేతకాని జాతి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిరాహార దీక్షలు ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టి ప్రభుత్వానికి విన్నవించుకోవటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జాడి నాగరాజు, సప్పిడి వెంకటేశ్వర్లు, జాడి నాగరాజు, దుర్గం ప్రేమ్ కుమార్, కుమ్మరి సమ్మయ్య, సల్లూరి వెంకటేశ్వర్లు, కరకగూడెం మండల నాయకులు కొండ గొల్ల వెంకటేశ్వర్లు, గోగు సమ్మయ్య, సప్పుడు రామ్మూర్తి, జాడి చిన్న వెంకటేశ్వర్లు, కుమ్మరి కుమార స్వామి, జాడి తిరుపతమ్మ, జాడి ఐలమ్మ, గాంధర్ల మహాలక్ష్మి , గోగిల కుమ్మరి, మంగమ్మ, గోగు సమ్మక్క, గాంధర్ల ముసలయ్య, గాంధర్ల గంగరాజు, గాంధర్ల జానీ, బానిస పాపయ్య, బానిస రామచంద్రం, గాంధర్ల నారాయణ తదితరులు ఈ సమావేశానికి హాజరై విజయవంతం చేశారు.

## పెనుబల్లి మండలంలో ప్రేమించి ప్రేమ విందు



ప్రజాపక్షం/పెనుబల్లి: మండలంలోని క్రైస్తవ కుటుంబాలకు ప్రేమించు ప్రేమ విందు పేరుతో తెలంగాణ ప్రభుత్వం మండలానికి రూ. 37, 000 కానుకగా అందజేసింది. అందులో భాగంగా శనివారం మండలంలో క్రైస్తవ సంఘాలు ప్రేమ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. పెనుబల్లి మండల పాస్టర్లు కొందరు బీరెల్లి వరప్రసాద్, ఎన్‌సిసి కమిటీ ప్రెసిడెంట్ పాస్టర్ కె దేవదానం, ఏఐసిసి ప్రెసిడెంట్ డేవిడ్ పాల్, టిసిసి ప్రెసిడెంట్ బి. సుధీర్‌బాబు, ఎం. ప్రశాంత్ కుమార్ పేతురు, వి.విజయ్, చాట్ల నాగేశ్వరరావు, ఎం. వేణుపాల్ తదితర పాస్టర్లతో పాటు తహశీల్దార్ గంటా ప్రతాప్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, గోగినేని రమేష్, మేకతొట్టి కాంతయ్య, క్రైస్తవులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తాం

ప్రజాపక్షం/మణుగూరు రూరల్: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరిగిన రెండు న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభకు మణుగూరు ప్రాంతం నుండి పెద్ద ఎత్తున నాయకులు, ప్రజా సంఘాల శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ విప్లవ పార్టీల ఐక్యత ఎంతో సంతోషంగా రెండు న్యూడెమోక్రసీ పార్టీల ఐక్యత స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి ప్రజాసంఘాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసేందుకు ఈ ఐక్యత ఉపయోగపడిందన్నారు. విలీన సభకు హాజరైన భద్రాచలం సబ్ డివిజన్ న్యూ డెమోక్రసీ పార్టీ శ్రేణులు నాయకులు పిఓడబ్ల్యూ భద్రాచలం సబ్ డివిజన్ బాధ్యులు పెదగోని ఆదిలక్ష్మి, రాపర్తి లక్ష్మి, కప్పల సూర్యకాంతం, రాములక్క అరుణోదయ సాంస్కృతి సమాఖ్య జిల్లా నాయకులు జక్కం కొండలరావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, మణుగూరు ఏరియా ఓబి వర్కర్స్ యూనియన్ నాయకులు పెనుగొండ నాగార్జున, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉప్పల శివరామకృష్ణ, పివైఎల్ మణుగూరు మండల కార్యదర్శి సాధనపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పాయంను కలిసిన అశ్వాపురం ప్రెస్ క్లబ్

**-జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇప్పించాలని వినతి**



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండల వర్కింగ్ జర్నలిస్టలకు ఇండ్ల స్థలా లు మంజూరు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుని వారి నివాసంలో అశ్వాపురం ప్రెస్ క్లబ్ సభ్యులు కలిశారు. ఈసందర్భంగా మండలంలోని జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసి వినతి పత్రం అందించారు. అనంతరం జర్నలిస్టలతో ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ అశ్వాపురంను నేను కూడా చూస్తున్నాను అన్నారు. త్వరలోనే జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వెలమ రాజేందర్, ప్రధాన కార్యదర్శి పర్సబోయిన రాధకృష్ణ, కోశాధికారి ములకలపల్లి గోపినాథ్, సభ్యులు తాండ్ర వెంకటరావు, లెనిన్ కుమార్, నగేష్, అంజనరావు, అర్జున్, నాగరాజు, కోటేశ్వరరావు, మల్లారెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ ఎండి ఆకస్మిక తనిఖీ

**-వేపలగడ్డలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనితీరును పరిశీలించిన గౌతమ్**





ప్రజాపక్షం/బూర్గంపాడు: మండల పరిధిలోని వేపలగడ్డ గ్రామంలో శనివారం తెలంగాణ రాష్ట్ర హౌస్గి ఎండి వి పి గౌతమ్ ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనితీరుపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల వివరాలను మొబైల్‌లో ఇంటింటి సర్వే తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని దళారులు ఎవరైనా డబ్బులు అడిగిన ఇవ్వొద్దని, అర్హులైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఇస్తాయని తెలిపారు. సర్వే సమయంలో క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం అంచనా కచ్చితంగా వేయాలని సర్వే సిబ్బందికి సూచించారు. ఆయన వెంట హౌసింగ్ పీడీ శంకర్, జెసి వేణుగోపాలరావు, భద్రాచలం ఐటిడిఏ పివో బి రాహుల్, మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి, మండల తహసీల్దార్ ముజాహిద్, ఆర్ఐ నరసింహారావు, గ్రామ పంచాయితీ కార్యదర్శి బిందుష, కంప్యూటర్ ఆపరేటర్ రవి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ప్రజాపక్షం/ములకలపల్లి: గ్రామ పంచాయితీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు మండల కన్వీనర్ నిమ్మల మధు, ఏఐటియూసి మండల కార్యదర్శి ఎస్‌కే జబ్బర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్మికుల టోకెన్ సమ్మె రెండో రోజు సంఘీభావంగా సిపిఐ, తెలుగుదేశం పార్టీలు మద్దతు తెలియజేశాయి. ఈసందర్భంగా సిపిఐ నాయకులు నరాటి నరేష్, తెలుగుదేశం పార్టీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ పంచాయితీ కార్మికుల పోరాటానికి మా మద్దతు పూర్తిగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఎంపీడీవో రేవతికి డిమాండ్లతో కూడిన మెమొరండం అందజేశారు. ఈకార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్(సిఐటియు) మండల కార్యదర్శి గంటా శ్రీనివాసరావు, వర్క రుక్మధరావు, ఏఐటియూసి మండల నాయకులు గద్దల మహేష్, వాంకుడోత్ వీరు, నాయకులు బైటి అశోక్, పోక్కిలి నరేష్, ఒగ్గేల దారయ్య, గుగులోతు శంకర్, వెలకం రాఘవులు, బొమ్మగాని శంకర్, అనిల్, చాప వెంకటేష్, కణితి చిట్టిబాబు, పద్దం రమేష్, కొర్రి వీరాస్వామి పాల్గొన్నారు.

## వెంకటేశ్వరస్వామి వారికి సర్వాంగాభిషేకం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చకులు తెల్లవారు జాము నుండి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభించి పంచామృతాలతో సర్వంగాభిషేకం, సహస్రనామార్చన తదితర పూజా కార్యక్రమాలు అంగరంగవైభవంగా జరిపారు. పెద్ద ఎత్తున మహిళలు పొంగళ్లు చేసి స్వామి వారిని నివేదన చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలివేలు మంగా, పద్మావతి అమ్మవార్లను పల్లకిసేవతో గోవింద నామస్మరణ మధ్యన నిత్య కళ్యాణం వేదిక వద్దకు తీసుకువచ్చి అంగరంగ వైభవంగా నిత్య కళ్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, సోమయ్య, కృష్ణప్రసాద్, వేదపండితులు విజయకృష్ణ, అర్చకులు మురళీమోహన్‌శర్మ, రాజీవ్ శర్మ, సుదర్శనశాస్త్రిమూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# పంచాయతీ సమస్య మంత్రులకు పట్టదా..?

**-పెండింగ్ వేతనాలను విడుదల చేయండి**
**-రెండవ రోజు సమ్మెలో పంచాయతీ సిబ్బంది**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు లేక నెలల తరబడి ఇబ్బందులు పడుతున్నా ఈ సమస్య మంత్రులకు పట్టదా అని కార్మిక సంఘాల నాయకులు ప్రశ్నించారు. రెండవ రోజు రఘునాథపాలెం మండల కేంద్రంలో ఎండివో కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల నేతృత్వంలో పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. ఆందోళనకు మద్దతుగా ఏఐటియుసి, సిఐటియు, టియుసిఐ నేతలు పాల్గొని కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వివిధ కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలలుగా వేతనాలు రాకపోవడంతో సమ్మెకు పూనుకోక తప్పలేదని అయినా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వం పంచాయతీ కార్మికులను విస్మరించి మల్టీ పర్పస్ విధానాన్ని తీసుకువచ్చి గందరగోళం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పూర్తయిన పంచాయతీ సిబ్బంది విషయంలో ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడం లేదని కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని నేతలు డిమాండ్ చేశారు. మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేసి కార్మికులకు పాత పద్ధతిలో విధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు తోట రామాంజనేయులు, మందా వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు నవీన్ రెడ్డి, టియుసిఐ నాయకులు జి. రామయ్య, కె. శ్రీనివాస్, జేపిసి నాయకులు పి. మల్లయ్య, జి. రాందాస్, నెహ్రూ, భద్రు, సంపత్, వెంకటేష్, విజయలక్ష్మి, వీరయ్య, రవి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సంక్రమణ వ్యాధుల పట్ల నిబద్ధతతో సేవలు

**-డాక్టర్ బి. రవీంద్రనాయక్**
**-మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్ సందర్శన**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : సంక్రమణ వ్యాధుల పట్ల నిబద్ధతతో సేవలు అందించాలని తెలంగాణ వైద్య ఆరోగ్య సంచాలకులు బి. రవీంద్రనాయక్ వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఖమ్మంలోని మామిళ్లగూడెం అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి రోగుల రాక, మందుల పంపిణీ, సిబ్బంది హాజరు తదితర విషయాలను పరిశీలించారు. స్టోర్ మెయింటినెన్స్ చూసి సంతృప్తి వ్యక్తం చేసిన డాక్టర్ రవీంద్రనాయక్ ల్యాబులో ఏఏ పరీక్షలు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. టిహబ్‌కు శాంపిల్స్ పంపిస్తున్నారా అని ఆరా తీశారు. ఆ తర్వాత సిబ్బందితో రివ్యూ మీటింగ్ నిర్వహించి వైద్యాధికారి సహా ఏ సిబ్బంది ఎటువంటి సేవలు అందించాలో ఆయన సూచించారు. పిహెచ్‌సిలలో బయోమెడికల్ వేస్టేజ్, శానిటేషన్ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు ఆసుపత్రిలో కాన్పులు పెంచాలని, పేద ప్రజలకు వైద్యం అందేవిధంగా ఆసుపత్రుల నిర్వహణ ఉండాలని సూచించారు. సిబ్బంది తమకు నిర్దేశించిన పనిని చేయడంలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పనిచేయాలని రవీంద్ర నాయక్ సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని డాక్టర్ బి. కళావతి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సైదులు, వైద్యులు చందునాయక్, రామారావు, వెంకటరమణ, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా 25.70 లక్షల మొక్కల పెంపకం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : జిల్లాలోని నర్సరీలలో 25.70 లక్షల మొక్కల పెంపకం కోసం చర్యలు శర వేగంగా పూర్తి చేస్తున్నట్లు అడిషనల్ డీఆర్డీవో శిరిష పేర్కొన్నారు. మండలం లోని రాజేశ్వరపురం, మోటాపురం, చెన్నారం తదితర గ్రామాలలో శనివారం నర్సరీలను పరిశీలించారు. ఈజీఎస్ సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలోని 589 గ్రామపంచాయతీ నర్సరీల ద్వారా వచ్చే ఏడాది మొక్కల పెంపకం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా వరకు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పాత వాటి స్థానంలో నూతనంగా కన్వర్షన్ కోసం 12.49 లక్షల మొక్కలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది 62 లకల పని దినాలు లక్ష్యంగా కాగా ఇప్పటి వరకు 54.33 పనిదినాలు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పని దినాలను మార్చి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలో జిల్లాలో చేపట్టే పనులను గుర్తింపు కోసం ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించి సిద్ధం చేసినట్లు తెలిపారు. కూలీలకు పనుల కొరత లేకుండా తగిన పని దినాలు కల్పించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ యం.యర్రయ్య, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, ఈసీ శేషగిరిరావు, టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, ఆయా పంచాయతీల ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో మీసేవ కేంద్రాలు ఉండాలి

**ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే**
**షాపు లైసెన్స్ రద్దు చేస్తాం : తహసిల్దార్ పి.వి.రామకృష్ణ**




ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : తిరుమలాయపాలెం మండల పరిధిలో ఉన్న మీసేవ కేంద్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసిల్దార్ పి.వి.రామకృష్ణ తెలిపారు. తహసిల్దార్ కార్యాలయంలో శనివారం మీసేవ కేంద్రాల నిర్వాహకులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీసేవ కేంద్రంలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే షాపు లైసెన్సులు రద్దు చేస్తామని ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించాలని అని తెలిపారు. కొందరు మీ సేవ నిర్వాహకులు మీసేవ కేంద్రంలో వేరే వ్యాపారం పెట్టుకుని ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని షాపు తెరిచి ప్రజలకు అందుబాటులో లేకుండా ఎక్కడో ఉంటూ ప్రజలను విసిగిస్తున్నారని అలాంటి వారికి లైసెన్స్ రద్దు చేసి వేరే వారికి అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. మీసేవ కేంద్రం అందరికీ ప్రజలకు కనిపించే విధంగా బోర్డు ఏర్పాటు చేయాలని నిర్వాహకుడి ఫోన్ నెంబర్ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని సుదీర్ఘ ప్రాంతాల నుంచి ప్రజలు వివిధ అవసరాల కోసం వచ్చినప్పుడు వారికి కనీస సౌకర్యాలు సమకూర్చాలని తాగునీరు కూర్చోటానికి కుర్చీలు ఫ్యాన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని ధ్రువపత్రాలు భూముల రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ తప్పిదాలకు తావు లేకుండా ఆన్లైన్ చేసేటప్పుడు సమగ్రంగా అన్ని పత్రాలు జతపరిచి ఆన్లైన్ చేయాలని అనంతరం ప్రభుత్వం నిర్దేశించిన నగదు మాత్రమే ప్రజల వద్ద నుంచి వసూలు చేయాలని ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తే లైసెన్సు రద్దు చేయక తప్పదని ఆయన హెచ్చరించారు.

# ఎస్పి ఎదుట లొంగిపోయిన ఐదుగురు మావోయిస్టులు



ప్రజాపక్షం/భద్రాచలం : నిషేదిక మావోయిస్టు పార్టీ సభ్యులు ఐదుగురు ఎస్‌పి రోహిత్ రాజ్ ఎదుట శనివారం లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో పూనెం పొజ్జి, వెట్టిదేవ, మడ కం ఉంగి, రవ్వ సోమ, మడివి గంగి ఉన్నారు. వీరంతా పలు హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు పలు కేసులు నమోదయ్యాయి. సాధారణ జీవితం గడపాలని ఉద్దేశ్యంతో జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లు లొంగిపోయిన వారు తెలిపారు. వీరికి ప్రభుత్వం నుండి పునరావాసం, జీవనోపాధికల్పిస్తామని ఎస్‌పి తెలిపారు.

# రాష్ట్ర మహాసభలకు తరలిన ఉపాధ్యాయులు



ప్రజాపక్షం/ మధిర : నల్గొండలో నేటి నుండి 30వ తేదీ వరకు జరిగే టిఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలకు శనివారం మధిర డివిజన్ ఉపాధ్యాయులు తరలివెళ్లారు. టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు షేక్.నాగుర్‌వలీ, అనుమోలు కోటేశ్వరరావు, ప్రాంతీయ కార్యాలయం కన్వీనర్ ఎ.వినోద్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సును సీనియర్ నాయకులు తాళ్ళూరి ఆంజనేయులు, రావిరాల లక్ష్మణరావు, మీరాఖాన్ తదితరులు జెండా ఊపి ప్రారంభించగా భారీ ఎత్తున డివిజన్ నాయకులు, ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

# అందుబాటులోకి డిఎపి కట్టలు

ప్రజాపక్షం/ మధిర : మండల పరిధిలోని దెందుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నందు డిఎపి కట్టలు అందుబాటులో ఉన్నాయని సంఘం బాధ్యులు తెలిపారు. ప్రస్తుతం డిఎపి కట్ట ధర రూ.1350 ఉందని, అదేవిధంగా కొత్తగా వచ్చిన కాంప్లెక్స్ ఎరువులు ధరలు పెరిగాయని, ప్రస్తుతం డిఎపి ధరలు కూడా ఈ నెలాఖరుకు పెరిగే అవకాశం ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# టాలెంట్ టెస్ట్‌లో లక్ష్య టాలెంట్ స్కూల్ విద్యార్థికి బహుమతి



ప్రజాపక్షం/పెనుబల్లి: సత్తుపల్లిలో రామకృష్ణ భావ ప్రచార సమితి ఆధ్వర్యంలో సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు, కల్లూరు మండలాల స్థాయిలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో లక్ష్య టాలెంట్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి పి. కృష్ణ సాయి హేమంత్ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు హేమంత్‌ను అభినందించారు.

# రామయ్యకు రత్నాంగి కవచం బహుకరణ

**-ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు**

ప్రజాపక్షం/భద్రాచలం : హైదరాబాద్‌కు చెందిన పిన్నమనేని బాల మురళీ కృష్ణశాంతి దంపతులు రామయ్యకు రూ.40 లక్షల విలువ చేసే రత్నాంగి కవచానిన బహుకరించారు. శనివారం యాగశాలలో ప్రత్యేక పూజలు చేసి కవచాన్ని ఇవి రమాదేవికి అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఇక నుండి రత్నాంగి కవచాన్ని ప్రతీ ఆదివారం పూజా కార్యక్రమాల్లో వాడనున్నట్లు ఇఓ తెలిపారు.

# గ్రానైట్, మార్కర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ప్రజాపక్షం/ఖమ్మం : ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ 2025 సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం నాయుడుపేట జంక్షన్‌లోని పివిఆర్ గార్డెన్స్‌లో జరగనుంది. ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హాజరుకానున్నారు.

# మైనార్టీలు వృత్తి శిక్షణ కొరకు చేసుకోవాలి

ప్రజాపక్షం/ఖమ్మం : మైనార్టీలు వృత్తి శిక్షణ కొరకు జనవరి ఆరవ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి కె. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ముస్లిం, సిక్కు, బౌద్ధులు, జైనులు, వివిధ రంగాల్లో శిక్షణ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 18 నుండి 35 ఏళ్ల లోపు ఇంటర్ ఆపై చదివిన అర్హులైన వారు హార్డ్‌వేర్, నెట్ వర్కింగ్, ఎగ్జిక్యూటీవ్ రంగాల్లో మూడు నెలల కాల పరిమితితో శిక్షణ పొందవచ్చునని తెలిపారు. ఆసక్తి కలిగి అర్హులైన వారు కలెక్టరేట్ రెండవ అంతస్తులోని ఎస్ 29 మైనార్టీస్ సంక్షేమ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఆదాయ, కుల, ఆధార్, విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలను జత పరిచి ఇవ్వాలన్నారు.